
# తెలుగు ప్రేమ

## కొలను వేంకట దుర్గాప్రసాద్



'సుందరి! నా... సుందరి! రా నాదరి!' పాట వినవస్తోంది గట్టిగా. అర్ధ రాత్రి సినిమాపాట ఏమిటి? ఈ సుబ్బారావు గాడు రేడియో కట్టేయకుండా పడుకుని వుంటాడు. ఏ మలేసియానో, మారీషస్ స్టేషనో అయి వుంటుంది— అనుకుంటూ చెత్త తెలుగు సినిమా చూసినంత విసుగ్గా లేచి రేడియో కట్టేయబోయాడు రాజా. ఆశ్చర్యం! అది కట్టేసే వుంది. మరయితే పాట ఎక్కడ్నుంచి! ప్రక్క ఇంట్లోనుంచా? వుహు!

బెడ్‌లైటు వెలుతురులో నిద్రపోతున్న సుబ్బారావు వంక చూసాడు. సదరు పాట అతగాడి నోట్లోంచి ధారాళంగా వస్తోంది! రాజా కళ్లునులుముకుని చూసాడు. సుబ్బారావు నోట్లోంచి పాట వస్తూనే వుంది. మళ్ళీ మళ్ళీ నులుముకున్నాడు. అదే దృశ్యం. ముచ్చెంగా మూడోసారి కళ్ళు నులుముకుందా మనుకున్నాడుగానీ, కనుగుడ్లు నెప్పి అనిపించి మానేశాడు.

రాజా గభాల్న లైటు వేశాడు. పద్దెనిమిదేళ్ళ పాపాయి నవ్వినంత వెలుగొచ్చింది గదిలో. రాజా సుబ్బారావు పక్కమీదికి దూకి భయం భయంగా తట్టి లేపాడు. 'ఒరేయ్ సుబ్రావ్? సుబ్రావ్?' అని బావురు మన్నాడు. సుబ్బారావు కంగారుగా లేచాడు.

'ఏమిట్రా ఏమయిందీ?— ఏం కొంప మునిగింది?' అడిగాడు సుబ్బారావు.

'నువ్వేదో కలవరిస్తున్నావు, పాటలుపాడుతున్నావు, సంగీతం కూడా విన వచ్చింది మధ్య మధ్యలో. నాకేమిటో భయంగా, దిగులుగా వుంది? అయినా దయ్యాలగురించి భూతాల గురించి వద్దురా అంటే చదువుతావు!' అన్నాడు రాజా.

'పాట పాడానా? ఏం పాట? తెలుగా, హిందీనా?'

'తెలుగే! సుందరి నా సుందరి-రానాదరి! అని పాడావు. ఇది ఏ సినిమాలోది? పాతది కాదనుకుంటా. కొత్తదే! రాబోయేది కామా? పేరేమిటీ? హీరో ఎవరూ? హీరోయిన్నెవ్వరు? జయమాలినుందా?' ప్రశ్నల వర్షం కురిపించాడు రాజా.

'ఆగు!' సుబ్బారావు ఉరిమాడు.

రాజా తన వర్షాన్ని ఆపాడు.

సుబ్బారావు మొహం సీరియస్‌గా వుంది. 'అది సినిమా పాట కాదు. నా సొంతపాట. కలలో నా ప్రేయసితో పాడుతున్నాను. బంగారం లాంటి కల చెడగొట్టావు మళ్ళీ అలాంటి కల వస్తుందా? ఎన్ని రోజులు నిద్రగాసి ఈ కలగన్నానో నీకు తెలుసా?... ఒరే! నిన్ను వెలగని మున్సిపాలిటీ లైటు స్తంభానికి కట్టేసి, అమావాస్య అర్ధరాత్రి పూట, దయ్యం కథ చదివి వినిపిస్తా! ముందసలు పదిలక్షలకు 'సంతోషనప్పుండావా

నేస్తా!' అంటూ గింజుకుంటూ లేచాడు సుబ్బారావు.

రాజా వణికిపోయాడు దయ్యం కథ అనగానే! 'వద్దు! వద్దు! నాకు దయ్యం కథ వద్దు!' అరిచాడు.

'చదవనులే! అది చదివే ధైర్యంపోయింది నాకు! అందుకే సంతోష నష్టం దావావేస్తున్నాను! ఇచ్చేయ్ పది లక్షలు' అరిచాడు సుబ్బారావు.

'ఆగాగు! మీద పడకు! ఇప్పుడే ఇచ్చేస్తా! నేరకపోయి నిద్ర లేపా నిన్ను!' అంటూ లేచి పెట్టెలోంచి ఒక పంచరంగుల కాగితం తీసి ఇచ్చాడు.

'ఏవిటిది, యే క్యాషై?'

'లాటరీ టికట్టు! పది లక్షలు బంపరు! రేపే డ్రా! ఆలసించిన ఆశా భంగం! మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి...!'

'ఆపు గోల!' అని దాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు పక్కమీదకు వాలి దుప్పటి కప్పుకున్నాడు. మళ్ళీ గభాల్న లేచి 'ఇక నన్ను లేపకు!' అన్నాడు.

'ఆ! అంటే, మళ్ళీ లేవవా!' వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అడిగాడు రాజా.

'అబ్బ! నువు లేపకు. నేను లేస్తాలే! ఓ విషయం బాగా గుర్తు పెట్టుకో! నేను నిద్రలో పాట పాడుతున్నప్పుడు లేపకు. అర్థ వయిందా?' అని ముసుగు తన్నాడు.

రాజా చాలా సేపు కూర్చుండి పోయాడు, సుబ్బారావు నోటిలోంచి మరేదైనా పాట వస్తుందేమోనని.

సుబ్బారావు అటు మెదిలాడు- యిటు మెదిలాడు, బోర్లా పడుకున్నాడు. వెల్లకిలా పడుకున్నాడు. ఇక లాభం లేదనుకుని లేచి కూర్చున్నాడు.

'నేను లేపలేదు,నువ్వేలేచావు, తెలిసిందా?' కాస్త భయంగా అన్నాడు రాజా.

'సరేలే! ఆ కల మళ్ళీ రాలేదు. సినిమా విశ్రాంతిలోనే ఆగిపోయినట్టయింది; ఒరే రాజా! వచ్చేజన్మలో నువు ఫ్లాప్ సినిమా నిర్మాతవయి పుడతావు!' అని శపించాడు.

'అయినా నిన్నని లాభమేవిటి! నా కర్మ అలా వుంది! నువ్వు పడుకో!'అని నిట్టూర్చి రాజాని నిద్రపుచ్చాడు. రాజా నిద్రపోయాడు అమాయకంగా.

'పిచ్చి రాజా! రేపు ప్రజల్ని నిట్టూర్చి పొలిస్తాడో ఏమిటో?' అనుకున్నాడు. నిద్ర పట్టక లేచి పచార్లు మొదలెట్టాడు.

రాత్రి రెండయింది. రాజాకి మెలుకువొచ్చింది. సుబ్బారావు అట్లా పచారు చేస్తూనే వుండటం గమనించి 'ఏరా, నిద్ర రావడంలేదా?' అడిగాడు.

'లేదురా! అవును కానీ, నీ దగ్గర నికన మిక్సు టెకస్టు బుక్కుందా? కాలేజీలో ఏ పిల్లకైనా ఇచ్చావా?''.

'లేదు, నా దగ్గరే వుంది, అయినా చదువు మీద అంత శ్రద్ధ వచ్చిందేమిరోయ్!'

'అదిచదివితేనన్నానిద్రపడుతుందేమోనని?' ఆశగా అన్నాడు సుబ్బారావు.

రాజా పుస్తకం ఇచ్చాడు. సుబ్బారావు పక్కమీదకూర్చుని దీర్ఘంగా చదువుతున్నాడు. పదినిముషాలయింది. సుబ్బారావు పుస్తకం మూసాడు.

'ఏరా నిద్రవస్తోందా?' సంతోషంగా అడిగాడు రాజా.

''లేదురా! తలనెప్పి వస్తోంది.'' విచారంగా మొహం రుద్దుకున్నాడు సుబ్బారావు.

రాజాకు దుఃఖం పెల్లుబికి వచ్చింది. వెంటనే సుబ్బారావు రెండు చేతులుపుచ్చుకుని 'ఒరే సుబ్బారావు! నన్ను క్షమించు. శపించు. నీ కలను చెదరగొట్టాను. నీ నిద్ర చెదరగొట్టాను. నీ పక్క చెదరగొట్టాను. నీ తల చెదరగొట్టాను .. ఇంకా...ఇంకా...' అటూ ఇటూ మాటలకోసం వెతుకుతున్నాడు రాజా.

'నీ బాధ అర్థమయింది! దీనికి అన్ని సార్లు సినిమాలో మాదిరిగా డైలాగులు చెప్ప

## "....దుందుభి –!"

కన్నీటి కడలి
కెరటాల హోరుతో
భగ్నగుండియ
విక్రుతరావాలతో
పథవిహీన బతుకు
పితారల అపశ్రుతులతో
చిక్కని చిమ్మచీకట్లతో
నిండిన ఈ ధాత్రికి
విచ్చేసిన దుందుభి
ముదంతెచ్చిందో!
లేక ఖేదమే తెచ్చిందో!
చూడాలి మరి??

— డి. సి. కేశవరావు

క్కర్లేదు. అయినాగానీ ఒరే పిచ్చివాడా! కర్మ పకారం అన్నీ జరుగుతాయి. చెడగొట్టడం, బాగుచెయ్యడం నీ చేతుల్లో ఏం వుంది?' సుబ్బారావు వేదాంతిలా సీలింగుకేసి చూస్తూ చెప్పాడు.

రాజా చెయ్యి చూసుకున్నాడు. 'అవును నా చేతిలో ఏమీ లేదు' అన్నాడు.

'నీకూ కర్మ సిద్ధాంతం తెలుస్తోంది!' సుబ్బారావు కళ్ళు సగం మూసి అన్నాడు.

'అంతా నీ దయ!' సిగ్గుపడ్డాడు రాజా.

సుబ్బారావు బరువుగా నిట్టూర్చి 'రాజా! నువ్వు ఒట్టి అమాయకుడవిరా! రేపు ఈ వూరిని నీ చేతుల్లో పెడితే నిట్టూ పరిపాలిస్తావురా?'

'నాకు సెక్రటరీలు వుంటారుగా!' అన్నాడు రాజా, అసలు పేరు రాజారావు.

'సోన్లే! ఆ మాత్రం తెలుసుకున్నావు!' అని మళ్ళీ దుఃఖంలో మునిగిపోయాడు.

'సుబ్రావ్! నీవిచారానికి కారణమేమిట్రో? ఇంటిదగ్గర్నుంచి మనియార్డరు రాలేదా? కొత్త సినిమా టిక్కట్లు దొరకలేదా? రేపట్నుంచి కామర్సు క్లాసులో ముందుసీట్లో కూర్చోమన్నాడా లెక్చరరు? కొత్త డ్రెస్‌వల్ల చిగుళ్ళువాచినెప్పిగావున్నాయా? కొత్తబూట్లు కరిచాయా? ఇల్లు గల్నాయన రూము ఖాళీ జెయ్యమన్నాడా?... ఏవిటీ... ఏవిటీ... చెప్పరా! నేను చేయగలిగింది చేస్తాను. మళ్ళీ నీకు ఆ కల రావాలా? నాకు చేతకాదు. ఇంకే మయినా చెప్పు. నా టెక్స్టు బుక్కులన్నీ ఇచ్చేయ్ మన్నావా? క్షమించు. గైడ్సు ఇవ్వను. నా సైకిలు ఇచ్చేయనా? నా భోజనం టిక్కట్లు పుస్తకం ఇచ్చేయనా? ఇంకా వలభై ఏళ్ళ తర్వాత నా ప్రాణాన్ని ఇచ్చేయమన్నావా?' రాజా ఆవేశంగా అడిగాడు.

'వద్దులే! నే చెప్పేది విను! నేను ఓ అమ్మాయిని ప్రేమించాను. మన క్లాసే!' ఆగాడు సుబ్బారావు.

'ఎవ్వరా అది? తొందరగా చెప్పు! కొంప దీసి నే ప్రేమించిన పిల్లనే నువు కూడా ప్రేమించలేదు గదా?' రాజా కంగారుగా అడిగాడు.

'నువ్వు ప్రేమించావా? ఎవర్ని? చెప్పు?'

'నువ్వు చెప్పు!'

'లేదు, నువ్వే చెప్పు!'

'నువ్వే చెప్పాలి!'

'నేను ప్రేమించిన అమ్మాయి పేరు

సుందరి!' అని ఆగి సందేహంగా రాజా మొహంలోకి చూసాడు.

రాజా నవ్వాడు. గట్టిగా నవ్వాడు — సుబ్బారావుని కౌగలించుకుని సంతోషంగా అరిచాడు.

'నేను ప్రేమించిన అమ్మాయి సుందరి కాదు! సూర్యకుమారి'సంతోషంగా రొప్పుతూ అన్నాడు రాజా.

'బతికించావు. అట్లా నవ్వేసరికి భగ్న ప్రేమికుడవయి పిచ్చెక్కిందనుకున్నాను. పొన్లే గొప్ప ప్రమాదం తప్పిపోయింది. అందుకనే నీతి ఏమిటంటే, నువ్వు ఎవరినన్నా ప్రేమించావనుకో, వెంటనే, అది నీ స్నేహితుడికి చెప్పేయాలి. అప్పుడు వాడు నీకు అడ్డురాడు' అన్నాడు సుబ్బారావు.

'సరే, నీ ప్రేమ కథ చెప్పు!'

'సుందర్ని ప్రేమించావని చెప్పాగా! చాలా గాఢంగా ప్రేమించాను. మన మంత్రులు తమ పదవుల్ని ఎంతగా ప్రేమిస్తారో, అంత గాఢంగా నన్నమాట! ఇక వుండబట్టలేక ఉత్తరం రాసేసాను!'

'అమ్మో!' గుండెలమీద చెయ్యి వేసుకుని కళ్ళు పెద్దవి చేసి అన్నాడు, 'తర్వాత?'

'తర్వాత పోస్టు చేసాను!'

'మరయితే, దిగులెందుకు? స్టాంపులు అతికించలేదా?' రాజా అడిగాడు;

'అదీ చేసాను!'

'అడ్రసు రాయలేదా? లేక పొరపాటున జయమాలిని అడ్రసు రాసావా?'

'లేదు కరక్టు అడ్రసే రాసాను.'

'ఇది నా స్వంత రచన, దేనికీ అనువాదం గానీ, అనుసరణ గానీ కాదని, ఇంతకు ముందు ఈ ప్రేమలేఖని ఎవరికీ పంపలేదని హామీపత్రం రాసావా?' రాజా అడిగాడు.

'అదీ రాసాను!'

'మరయితే, దిగులెందుకు?' దిగులుగా అడిగాడు రాజా.

'సుందరి తెలుగు భాషాభిమాని అట! ఉత్తరంలో ఇంగ్లీషు వ్రాస్తే వాడ్ని ప్రేమించకపోగా, ద్వేషిస్తుందట!'

'మరి నువ్వు ఏ భాషలో రాసావు? ఇంగ్లీషులోనా?' ఎంతో ఆశ్చర్యంగా అడిగాడు.

'లేదు, సగం ఇంగ్లీషు, సగం తెలుగు, —రెండూ కలిపి రాసాను'అన్నాడు సుబ్బారావు.

'అయితే నిన్ను ప్రేమిస్తూ ద్వేషిస్తుందేమో?' లేదా, రెండూ చెయ్యడం మానేస్తుందేమో?'

'అయితే నా ప్రేమేంగాను?'వున్నట్టుండి బావురుమన్నాడు సుబ్బారావు.

'అదేమిటా అలా అయిపోయావు? నేనున్నానుగా. నీ ఆపద నా ఆపద. పద!' అన్నాడు రాజా.

ఏడుపు ఆపి 'ఎక్కడికి?' అడిగాడు సుబ్బారావు.

'ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళి, ఇట్లా మా వాడు ఉత్తరం రాసాడు. దాని సంగతేం జేసారు? అని అడుగుతాను. అన్నట్టు నువు రాసి ఎంత కాలమయింది?'

'పది రోజులు!'

'చిన్న ప్రేమ లేఖను పరిశీలించడానికి ఇన్ని రోజులా? అని అడుగుతాను' అన్నాడు రాజా.

'నిజంగానా?' ఆరాధనా పూర్వకంగా అడిగాడు సుబ్బారావు.

'నిజంగానే! పద!'

'ఇప్పుడెళితే దొంగలనుకుని పట్టుకుంటారు. తెల్లారిన తర్వాత, ఫ్రెష్‌గా వెళదాం!' అన్నాడు సుబ్బారావు.

'ఇంగ్లీషు మాటలు వాడడం మానేయ్! అదే అన్ని అనర్థాలకు మూలం!' కసురుకున్నాడు రాజా.

సుబ్బారావు రెండు మూడు సార్లు నాలిక కరుచుకున్నాడు ఇంగ్లీషు మాటలు రాకుండా తర్వాత ఇద్దరూ నిద్రపోయారు— ఎప్పుడు తెల్లారుతుందా అనుకుంటూ!

తెల్లారింది. ఇద్దరూ దిగ్గున లేచారు. గబగబా మొహాలు కడుక్కుని స్నానాలుచేసి హోటలుకెళ్ళి రెండిడ్లీ కారప్పొడి తినేసి కాఫీ తాగి, సైకిళ్లేసుకుని (కిళ్ళీలు కాదు) సుందరి ఇంటి ముందు వాలారు.

రాజా ధైర్యంగా సుందరి వాళ్ళ భవనం గేటు తెరిచాడు.

'ఎవరు కావాలి?' పనిమనిషి అడిగాడు.

'సుందరిగారి కోసం వచ్చాం!' అన్నాడు రాజా ధైర్యంగా!

సుబ్బారావు పిరికిగా రాజవెనక నడిచాడు.

'హాల్లో కూర్చోండి! అమ్మాయిగార్కి చెప్పేసి వస్తాను!' అన్నాడు.

రాజా సైకిలు స్టాండు వేసి దర్జాగా లోపలికి నడిచాడు. 'వీడిధైర్యం మండిపోనూ! పగలు ప్రతాపరుద్రుడు, రాత్రిళ్ళు (ఏడుపు) రాగాల రాజా.' అనుకున్నాడు సుబ్బారావు. సైకిలు స్టాండు వేసి తనూ రాజాతోపాటు హాల్లో సోఫామీద కూర్చున్నాడు.

హాల్లో గోడలకు లేడి తలకాయ, పులి తలకాయ కనిపించాయి. రేపు తన తలకాయ కూడా అక్కడ వుంటుందేమో అనిపించింది సుబ్బారావుకి. లోపల చలిజ్వరం మొదలయింది.

అక్కడ అందమైన బల్లమీద అన్ని తెలుగు పత్రికలున్నాయి.

సుందరి మందరంగా హాల్లోకి వచ్చి చూసింది. సుబ్బారావు దిగ్గున లేచాడు. అటూ ఇటూ కంగారుగా ప్రవహిస్తోంది అతని ఒంట్లోని రక్తం.

రాజా కూడా లేచాడు.

'సుబ్బారావుగారా! కూర్చోండి! రాజాగారు కూడా వచ్చారే! ఏమిటీ విశేషం? ఇంత ఉదయాన్నే?' అడిగింది నవ్వుతూ. తనూ ఎదురుగుండా సోఫాలో కూర్చుంది.

## 'మగవంట'కు గుర్తింపు

కొద్ది సంవత్సరాల క్రిందటిమాట— జపానులో పురుషులు వంటింట్లోకి ప్రవేశిస్తే, స్త్రీవారికి బొద్దింకమొగుళ్ళని మారు పేర్లతో పిలిచేవారు. అలాంటిది యీ నాడు పరిస్థితి పూర్తిగా మారి వంట చేసే మగవారికి అపారమైన గౌరవం కూడా లభిస్తున్నది. రోజులు మారడంతో మగవంటకు గుర్తింపు లభించింది. దరిమిలా జపానులో 1977 లో "వంటింటి పురుషుల క్లబ్బు" అనే క్లబ్బు కూడా ఏర్పడింది. కేవలం 30 మందితో ప్రారంభమైన యీ క్లబ్బులో ప్రస్తుతం 600మంది సభ్యులున్నారు. వీరిలో పెద్ద ఉద్యోగాలలో వున్నవారు, డాక్టర్లు, లాయర్లు కూడా వున్నారు. వీరు ప్రతి నెలా సమావేశాల్ని జరుపుకొని విదేశీ వంట నిపుణులను ఆహ్వానించి క్రొత్త వంటలను కూడా నేర్చుకుంటున్నారు.

'మా సుబ్బారావు ఒక ప్రేమలేఖ రచించాడు. పరిశీలనార్థం మీకు పంపించాడు. అది మీకు ఆమోదయోగ్యమా లేదా? తెలుసుకుందామని వచ్చాం!' అయిదు నిముషాల తర్వాత అన్నాడు రాజా.

'అమ్మో! అమ్మో!! వీడి ధైర్యం మండిపోను. ఇడ్లీలో కారప్పొడి బాగా వేయించుకుని తిన్నాడేమో? పోన్లే నన లేకుండా చెప్పేసాడు' అనుకున్నాడు సుబ్బారావు.

సుందరి మొహం విర్రనయింది! ఓ నిముషం తర్వాత అంది: 'ఉత్తరం రాసింది సుబ్బారావుగారు కనుక, నేను ఆయనతో మాట్లాడుతాను!' అని సుబ్బారావు కేసి తిరిగింది.

సుబ్బారావుకి చెమటలు పట్టేశాయి. అది చూసి 'మా పంకా అంతకంటే వేగంగా తిరగదు, ఏమీ అనుకోకండి' అంది. వెంటనే 'సుబ్బారావుగారూ! మీ ఉత్తరం చదివాను. మీకు తెలుగ్గానీ, ఇంగ్లీషుగానీ రాదని తెలుస్తోంది- ఆ ఉత్తరం చూస్తుంటే! ఇంగ్లీషు పరాయి భాష కాబట్టి సర్దుకుంటాము. తెలుగు కూడా రాయడం రాదు కదా! అన్నీ తప్పులే! ఒకదాని కొకటి దీర్ఘాలు, ఒకదానికొకటి వత్తులు, మీరసలు తెలుగు వారేనా?' అడిగింది.

'తెలుగు వాళ్ళమేనండి!'

'ఏ ప్రాంతం? ఏం జిల్లా?'

చెప్పాడు.

'సిగ్గు లేదూ? తెలుగు నడిగడ్డ మీద పుట్టి తెలుసు సరిగా రాయడం చేతకాదు. ఇట్లా అయితే మీ రెప్పుడు బాగుపడతారు? మన భాష ఎప్పుడు బాగుపడుతుంది?' ఆవేశంగా అంది.

రాజాకి కూడా కోపం వచ్చింది. సుబ్బారావు వంక తిరిగి 'ఏరా? ఉత్తరం చివర్లో తప్పులున్న ఎడల క్షమించి ఒప్పులుగా భావించవలెను అని రాయలేదా?' అని మళ్ళీ సుందరి వేపు తిరిగి 'వాడుట్టి కంగారు గొడ్డు రాయడం మర్చిపోయాడు' అని నవ్వాడు.

'అది తెలుస్తూనే వుంది. ఆ ఉత్తరంలో సగానికి పైగా ఇంగ్లీషు మాటలు. డియర్.. లవ్ .ఐ లవ్ యూ..పార్క్,హార్ట్ .బ్లైము.. ఇంట్లా ఎన్నో. మీలాంటి వారిని ఏం మొహం పెట్టుకుని ప్రేమించను? మీరు తెలుగువారు. తెలుగు భాషమీద అభిమాన ముండాలి. కన్న తల్లి లాగే కన్న భాష తెలుగు భాష నేర్చుకోవాలి తెలుగు చదవాలి తెలుగు రాయాలి. ఇతరులకు నేర్పించాలి. ఇతరుల చేత రాయించాలి. మనదేశంలో ఎక్కువగా ప్రజలు మాట్లాడే భాషలో రెండవ స్థానం ఆక్రమించింది- ఆ విషయం మీకు తెలుసా?'

'తెలీదు'అన్నాడు ఆశ్చర్యంగా సుబ్బారావు.

"అందుకే గురజాడ 'మనవాళ్ళుట్టి వెధవాయిలోయ్' అన్నారు" అంది సుందరి ఆవేదనగా.

'చిన్న కరెక్షను!' అన్నాడు రాజా.

సుందరికి ఒళ్ళు మండిపోయింది. 'ఇంగ్లీషు మాటలొద్దు, తెలుగులో పలకండి దానిని!' అంది.

రాజా తమాయించుకుని 'చిన్న వివరణ' అన్నాడు.

సుందరికి మళ్ళీ ఒళ్ళు మండింది: 'వివరణ గాదు! సవరణ' అని అనాలి' అన్నాడు సుబ్బారావు.

సుందరి ఆశ్చర్యంగా సుబ్బారావు వంక చూసి, ఆనక ప్రేమగా చూసి నవ్వింది.

'అవును, చిన్న సవరణ?' అన్నాడు రాజా.

'ఏమిటది?' సుందరి అడిగింది.

'అది గురజాడ అప్పారావు అనలేదు!'

'మరి?' కళ్ళు పెద్దవిచేసి చూసింది!

'గిరీశం అన్నాడు' అన్నాడు రాజా. సుందరి గలగలా నవ్వేసింది.

'అమ్మయ్య మీ కోపం పోయినట్టుంది!' అన్నాడు రాజా.

'ఇంకా పోలేదు. గురజాడ ఆ మాట గిరీశం చేత అనిపించి మంచిపని చేసాడు. మన వాళ మీద కోపం వచ్చినప్పుడల్లా తిట్టుకోడానికి' అంది.

'ఇంతకీ మా సుబ్బారావు ప్రేమలేఖ?' రాజా నసిగాడు.


'పరిశీలించడం జరిగింది. తపాలా బిళ్ళలు జతచేసి స్వంత చిరునామా రాసిన కాగితపు సంచీ వున్నట్టయితే, దానిని తిప్పి పంపడం జరుగుతుంది' అంది గంభీరంగా.

'ఆఁ!' అన్నాడు సుబ్బారావు.

'తెరిచిన నోరు మూసుకుని ఇకవెళ్ళిరండి!' అంది సుందరి విసురుగా.

సుబ్బారావు దిగులుగా లేచి తల వంచుకుని వెళిపోయాడు రాజా సుందరి దగ్గరగావెళ్ళి 'మీరు వాడ్ని క్షమించాలి. వాడికి తెలుగు సరిగ్గా రాదు- పాపం చిన్నప్పటంతా కాన్వెంటులో చదివాడు.

'మరయితే ఇంగ్లీషు కూడా తప్పులేకదా!' విసుగ్గా అంది సుందరి.



ఓం శ్రీ మాత్రే నమః



నవశక్తి నిలయం నుంచి
భక్తులకు వినూత్న అవకాశము

శ్రీ మురుగన్స్ మరియు జగద్గురువులు ఆశీర్వాదముతో
దైవదత్తమైన వస్తువు రూపొందించు సంస్థ

శ్రీ కంచి కామకోటి శ్రీ జయేంద్ర సరస్వతి,
శ్రీ శృంగేరి శారదాపీఠ మహా సన్నిధానము,
గోండల్ శ్రీ ఆచార్య శ్రీ శరణతీర్థ మహరాజ్
మరియు ఇతర ఋషి తుల్యులు.

| | | |
|---|---|---|
| 1. | శ్రీ మహామేరు (పంచ లోహాలు) $2\frac{1}{4}'' \times 2\frac{1}{4}''$ | రూ. 450—00 |
| 2. | శ్రీ మహామేరు (పంచ లోహాలు) $1\frac{1}{2} \times 1\frac{1}{2}''$ | రూ. 250—00 |
| 3. | ద్రిష్టి నివర్తి యంత్రము. | రూ. 45—00 |
| 4. | ద్రిష్టి నివర్తి డాలర్ (ఈ యంత్రము కలిగియున్న వారికి దుష్ట శక్తుల ప్రభావాన్ని తొలగించి, దృష్టి దోషమును హరించి ప్రమాదములు మొదలైనవి జరగకుండును. ఎటువంటి ఒడుదుడుకులు, కష్టములు సంభవించకుండా కాపాడును. గృహములోగాని, వ్యాపారములోగాని కూడ ఉంచుకొనవచ్చును). | రూ. 37—00 |
| 5. | వివాహప్రాప్తి డాలర్ (వివాహములు త్వరగా జరుగుటకు) | రూ. 45—00 |
| 6. | ధనప్రాప్తి డాలర్. | రూ. 45—00 |
| 7. | కామాక్షి డాలర్. | రూ. 45—00 |
| 8. | శ్రీ చక్రం యంత్రం 3" × 3" | రూ. 115—00 |
| 9. | శ్రీ చక్రండాలర్. | రూ. 45—00 |
| 10. | స్ఫటికమాల 54 పూసలు | రూ. 60—00 |
| 11. | ఒరిజినల్ తామరమాల 54 పూసలు | రూ. 100—00 |
| 12. | నవగ్రహ డాలర్లు (9 రకములు) ఒక్కొక్కటి. | రూ. 37—00 |
| 13. | రుద్రాక్షమాల 54 పూసలు | రూ. 250—00 |
| 14. | ఎలక్ట్రానిక్ బ్రాస్‌లెట్ 12 రాసులు ఒక్కొక్కటి | రూ. 20—00 |
| 15. | అష్టలక్ష్మి మరియు ఇతర దేవతా డాలర్ [ఎంబోసిడ్‌నమూనా] | రూ. 105—00 |

ఆర్డరుతో సరుకు విలువపై 25 శాతమును ముందుగా పంపవలెను,
వస్తువు వి.పి.పి. పోస్టు ద్వారా పంపబడును.

సంప్రదించండి.

విశ్వకర్మజ్ఞ శ్రీ విద్యా వుపాసక స్వామిజి,
శ్రీ ఎస్. టి. మురుగభూషణం.
(ప్రెసిడెంట్ మరియు సలహాదారుడు)

నవశక్తి నిలయం,
153, లాయడ్స్‌రోడ్, గోపాలపురం, మద్రాసు–600086.

ఫోన్ : 812013. ఉత్తర ప్రత్యుత్తరములు తమిళము మరియు ఇంగ్లీషులో.

# తెలుగు ప్రేమ

చదివింది కాన్వెంటులోనైనా, అక్కడ టీచరుకు ఇంగ్లీషు సరిగారాక, పాఠాలు తెలుగులో చెప్పేవారట. ఆ విధంగా పాపం, అటు తెలుగూరాక, ఇటు ఇంగ్లీషూ రాక, మీ ప్రేమకు నోచుకోకపోయాడు, ఏటాగయినా అతన్ని మీరే కాపాడాలి !'

'నేనేం చెయ్యను ?' విసుగ్గా అంది.

'మీరే అతనికి తెలుగు బోధించండి. పండితుడ్ని చేయండి. గొప్పవాడ్ని చేయండి.' రాజు ఆవేశంగా చెప్తున్నాడు.

'ఆగండి. కొన్ని షరతులు సుబ్బారావే కాకుండా, మీరంతా ఇకనుంచి, తెలుగులో బాగా రాయడం నేర్చుకోవాలి. తెలుగుపత్రికలు విరివిగా చదవాలి. తెలుగు దినపత్రికలను విధిగా చదవాలి. ఎక్కడికెళ్ళినా తెలుగు వాడినని గర్వంగా చెప్పుకోవాలి.

తెలుగు సినిమా గానీ, సాహిత్యం గానీ, బాగోలేకపోతే, దాన్ని ఖండించాలి. పత్రికలకు ఎప్పుడూ ఉత్తరాలు వ్రాసి మీ అభిప్రాయాలను వెలడి చేసుకోవాలి అడ్డమైనవాటికి కాకుండా తెలుగు బాషకు అభిమాన సంఘాలు పెట్టాలి ! ఇంత పెద్ద దేశంలో మనమూ వున్నాం అని తెలియజెయ్యాలి ! ఎంతసేపూ సినిమా కబుర్లు చెప్పుకోకుండా, తెలుగుభాష మీద చర్చలు పెట్టుకోండి. స్త్రీల కళాశాల వారి వాహనం వెళుతున్నప్పుడు 'పాల వ్యాను' అని అరవడం మానెయ్యండి. ఆడపిల్లను గౌరవించడం నేర్చుకోండి. తెలుగు బాషను ఆడపిల్లలాగే ఎగతాళి చెయ్యకండి. దాన్ని గౌరవించడం నేర్చుకోండి. ఇప్పుడు నే చెప్పిన షరతులన్నీ కాగితం మీద రాసి మీ విద్యార్థులంతా సంతకం పెట్టండి. అప్పుడు నేను సుబ్బారావుని తెలుగు కన్నా ఎక్కువగా ప్రేమించడానికి నాకు అభ్యంతరం లేదు. శలవు !' అని సుందరి వెళ్ళిపోయింది వేగంగా.

'అబ్బో ! చాలా గొడవుందే ? కాలేజీ కుర్రాళ్ళంతా చెబితే వింటారా ? తానేమైనా రాజకీయనాయకుడా! వాళ్ళను బుట్టలో వేసుకుని, కాగితాల మీద రాసి సంతకాలు పెట్టించుకోడానికి ? ఇదేదో తేలే వ్యవహారంలా లేదు. ఒరే! సుబ్బారావు ! ఇక నీకు దేవుడే... కాదు కాదు ... తెలుగే దిక్కు !' అంటూ సుబ్బారావుని వెతుక్కుంటూ బయలుదేరాడు రాజారావు.